దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పులిమామిడి గ్రామ నాయకులు

కందుకూరు, మే 14: పురాతన దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో ఈనెల 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు నిర్వహించే నూతన ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనాలని బుధవారం మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆనేగౌని దామోదర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఆనేగౌని పాండు గౌడ్, వత్తుల శ్రీనివాస్, మల్లయ్యతో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో గల దేవాలయాలు చాలా ఏళ్ల కింద నిర్మించడంతో పురాతనమయ్యాయని, అందుకోసం దేవాలయాలను తిరిగి నిర్మించాలని కోరారు. గ్రామాల్లో దేవాలయం లేని ఊరు లేదన్నారు. భగవంతుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరారు. భగవంతుని కృప వల్ల ప్రజలకు సేవ చేసే అదృష్టం వచ్చిందని తెలిపారు. భగవంతుని దయ ఉన్నంతకాలం ప్రజలు సుఖశాంతులతో ఉంటారని చెప్పారు. ప్రజలు దేవాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్ రెడ్డి, తదితరులు

సైదాబాద్, మే 14: న్యూ సైదాబాద్ కాలనీలో 25 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలో ఎటువంటి సమస్యలు లేకుండా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు బసవేశ్వర రావు, మదన్మోహన్, విష్ణువర్ధన్ రావు, హనుమంతరావు, ఉదయ దీపక్, రజిత, అనిత, లక్ష్మి, మాధురి, విజయలక్ష్మి, అరుణ, రూప, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేదెక్కడ?

- పోలీసుల నిర్లక్ష్యం.. ఫిర్యాదుదారుల అవస్థలు
- హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌పై కొరవడిన పర్యవేక్షణ
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే గానీ పరిష్కారానికి నోచుకోని సమస్యలు

హయత్‌నగర్, మే 14 : రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంగా జరిగిన పలు భూ ఫిర్యాదులపై, ఆయా ఘటనల్లో జరిగిన అన్యాయాలపై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే చేదుఅనుభవాలు ఎదురవుతున్నాయనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్తే పోలీసు అధికారుల నుండి నిర్లక్ష్యపూరిత సమాధానాలు చెప్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. ఇక్కడి సిబ్బంది తీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. పోలీస్ స్టేషన్‌కు డీఐని కేటాయించకపోవడం, లాఅండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి తమకు చెందిన వారికి సమయాన్ని కేటాయిస్తుంటే ఫిర్యాదుదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి దాపురించిందని అభిప్రాయపడుతున్నారు. ఫిర్యాదులపై అధికారులను గట్టిగా నిలదీస్తే వెళ్లి కోర్టులో చూసుకోండి.. అనే నిర్లక్ష్యపు సమాధానాలు ఎదురవుతున్నాయి. పైగా మీపై అవతలి పక్షం కూడా ఫిర్యాదు చేసిందని బాధితులను భయాందోళనకు గురిచేస్తున్నారని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

ఇటీవల జరిగిన పలు ఘటనల్లో...

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కోహెడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.951, 952లో జరిగిన వివాదంలో బాధితులు తమ ప్లాట్లు కబ్జా చేశారని, తమ ప్లాట్లలో జేసీబీ సహాయంతో చదును చేసుకుంటుండగా మరో వర్గానికి చెందిన వ్యక్తులు మారణాయుధాలు కలిగి దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు బాధితుల పక్షాన హత్యాయత్నం కేసులు నమోదు చేయకుండా తమ స్వంత వైఖరిని ప్రదర్శించారని, స్వయంగా హైడ్రా కమిషనర్ హయత్‌నగర్ సీఐ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలిక ఆత్మహత్య కేసులో...

హయత్‌నగర్ డివిజన్ బంజారాకాలనీలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని అదే కాలనీలో నివాసముంటున్న ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా, భౌతికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలి తండ్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం కూడా వేధింపులకు గురిచేస్తున్న యువకుడు, ఏకంగా బాధితురాలి ఇంటికెళ్లి బెదిరించాడు. ఈ ఫిర్యాదుపై పోలీసులు రెండు రోజులు గడిచినా స్పందించకపోవడంతో బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడింది.

హయత్‌నగర్‌లో...

మన్సూరాబాద్ డివిజన్‌లోని ఓ కాలనీలో కొంత కాలంగా రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తుతోంది. తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా కోపోద్రిక్తులైన స్టేషన్ అధికారి..వీళ్లను ముందుగా లోపలేయండి., వీళ్లపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తానంటూ బెదిరించారని మీడియాకు వారు గోసను వెలిబుచ్చారు. ఇప్పటి వరకు కూడా పోలీసులు బాధితుల ఫిర్యాదుపై స్పందించిన పాపాన పోలేదని వారు వాపోతున్నారు.

ఎవరికీ వారే.. యమునా తీరే

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పట్ల పోలీసు ఉన్న తాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్టేషన్ అధికారి, అక్కడ పనిచేస్తున్న కింది స్థాయి అధికారులు ఎవరికీ వారే యమునా తీరే..అన్న చందంగా వ్యవహరిస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వస్తే గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి దాపురించిందని అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఫిర్యాదుదారులు స్టేషన్ అధికారిని కలిసినా సెక్టార్ ఎస్ఐను కలువాలని పంపిస్తే అక్కడ సీటులో ఆయన ఉండని పరిస్థితులు ఎదురవుతున్నాయి. సార్... ఎక్కడికి వెళ్లారు ? ఎప్పుడు వస్తారు? అని అడిగిన వారికి నిర్లక్ష్యపు సమాధానమే ఎదురవుతుంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బాధిత ఫిర్యాదారులకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి వారికి న్యాయం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైభవంగా త్రినేత్రాంజనేయ స్వామి జాతర

త్రినేత్రాంజనేయ దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, తదితరులు

వనస్థలిపురం, మే 14 : సాహెబ్‌నగర్‌లోని ప్రఖ్యాత త్రినేత్రాంజనేయ స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో, భక్తుల కోలాహలం మధ్య ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. సాహెబ్‌నగర్, వనస్థలిపురం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. దేవస్థానం అభివృద్ధికి ఇప్పటికే ఎంతో చేశామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పూజలు చేసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జాతర ఉత్సవాలకు హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 400ల ఏళ్ల చరిత్ర కలిగిన గొప్ప ఆలయం సాహెబ్‌నగర్‌లో ఉందన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని దేవున్ని ప్రార్థించామన్నారు. జాతర కార్యక్రమంలో సాహెబ్‌నగర్ గ్రామ పెద్దలు, దేవస్థానం కమిటీ సభ్యులు, పలు పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, మే 14: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో గాను ఉపయోగపడుతుందని మల్క్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పాతబస్తీలోని క్యాంపు కార్యాలయంలో 58 మంది లబ్ధిదారులకు 28 లక్షల, 76 వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అదే విధంగా సీఎం సహాయ నిధి పథకానికి అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కేంద్ర బృందం

కందుకూరు మండల పరిధిలోని జైత్వారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కందుకూరు, మే 14 : అంగన్‌వాడీ కేంద్రాలను డామన్, డయ్యు నుంచి వచ్చిన కేంద్ర బృందం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం సుభాషిత్ గ్రామపంచాయతీ కింద మండల పరిధిలోని జైత్వారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు మహేశ్వరం మండలంలోని దుబ్బచెర్ల, సుభాన్ పూర్ కేంద్రాలను ఎంపిక చేశారు. అందులో భాగంగా బుధవారం ఆ సెంటర్ లను పరిశీలించారు. 5 సంవత్సరాలలోపు పిల్లల ఎత్తు, బరువులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతులు అయిన విద్యుత్, తాగునీరు, మూత్రశాలను తనిఖీ చేశారు. ఆరోగ్య లక్ష్మి, ప్రీ సిలబస్, ఇంటింటి అంగన్‌వాడీ రిజిస్టర్‌ను పరిశీలించారు. గర్భిణి, బాలింతలకు అంగన్‌వాడీ ద్వారా అందుతున్న సేవలను ప్రాజెక్టు అధికారి శాంతిశ్రీ వారికి వివరించారు. పోషణ పక్వాడ ద్వారా ప్రజల్లో పోషణ పై అవగాహన చైతన్యం కల్పించినట్లు తెలిపారు. దీంతో మహేశ్వరం ఐసీడీఎస్ జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉన్నట్లు వివరించారు. తక్కువ ఖర్చుతో చిరుధాన్యాలను తయారు చేసుకునే విధంగా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర బృందం మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. చిన్నపిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు.

కార్యక్రమంలో డామన్, డయ్యు బృందం నుండి వచ్చిన ప్రీతం జైలం, కొండ రామకృష్ణ, సీడీపీఓ శాంతిశ్రీ, సూపర్ వైజర్లు ఇందిరా, సువర్ణ, విద్యావతి, టీచర్లు సుమతి, అనిత, సంతోష, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది

అక్రమ అపార్ట్‌మెంట్ స్లాబ్ నిర్మాణాన్ని కూల్చివేసిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సైదాబాద్, మే 14: లక్ష్మీ నగర్ కాలనీ చౌరస్తాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అపార్ట్‌మెంట్ అక్రమ నిర్మాణ స్లాబ్‌ను బుధవారం జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చి వేశారు. సంతోష్ నగర్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పనులను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు కూల్చివేశారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ చౌరస్తాలో అపార్ట్‌మెంట్ అక్రమ నిర్మాణం కొనసాగుస్తోందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నారు. గతంలో సంతోష్ నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పనులను నిలుపుదల చేసి సీజ్ చేసినప్పటికీ, కొంతమంది ప్రోత్సాహంతో రాత్రి వేళల్లో దొంగ చాటుగా స్లాబ్ వేయడానికి ప్రయత్నం చేయడంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. ఒకవైపు అనుమతులు లేకుండా కొనసాగుతున్న అపార్ట్‌మెంట్ పనులను రాత్రి వేళల్లో కొనసాగించడంపై సీహెచ్ఎంసీ అధికారులు అసహనం వ్యక్తం చేసి, మళ్లీ పనులు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మన్సూరాబాద్, మే 14: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వలన కార్మికులు బానిసలుగా మారే అవకాశం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాహకంలో భాగంగా బుధవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్ పారిశ్రామికవాడలో పలు కార్మిక సంఘాలతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడ్ లను రద్దు చేసి కార్మికులకు ప్రయోజనకరంగా ఉన్న చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటు, ప్రైవేటు సెక్టార్ల యాజమాన్యాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన ఇప్పటికే ఎంతోమంది ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసే దిశగా కార్మిక సంఘాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి ఎల్లయ్య, చింతపల్లి కృష్ణయ్య, సుధీర్, దయానంద్, రాజకుమార్, దిగంబర్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

విద్యుత్ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతున్న ఈశ్వరరావు

సైదాబాద్, మే 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని తక్షణమే నిలిపి తెలంగాణ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరరావు, నలువాల స్వామి అన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆస్మాన్ ఘడ్ డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ గౌడ్, శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జెండాను, శిలాఫలకాన్ని వారు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ ఈ నెల 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోవర్ధన్, కుమార్ చారి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ గౌడ్, శ్రీధర్, థైసిన్, కృష్ణారెడ్డి, రాము, చంద్రా రెడ్డి, సత్యం, బాలరాజు, గిరిజన సంఘం నాయకులు బాలు నాయక్, సులేమాన్, జయపుత్ర, శ్రీను, రాజు, అంజన్‌ప్ప, 1104 అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

బడంగ్ పేట్, మే 14: నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు దాసరి బాబు డిమాండ్ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్మిక డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మె గోడ పోస్టర్లను మీర్‌పేట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో, తుక్కుగూడ పట్టణంలో ఏఐటీయూసీ దత్తు నాయక్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌ల లోకి మార్చి కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని వారు ధ్వజమెత్తారు. మే 20న సార్వత్రిక సమ్మెను అఖిల భారత కార్మిక సంఘాలు, ఫెడరేషన్ లు నిర్వహిస్తున్న సమ్మె నేపథ్యంలో ఆ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చాలీచాలని జీతాలు కార్మికులను తీవ్రంగా కలచివేస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జరిగే సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ధనుంజయ, వెంకటయ్య, నరసింహ, బాలకృష్ణ, మల్లికార్జున్, జీవన్, రజిత, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.దేవేంద్ర గౌడ్, కే .రాజు, ఆటో యూనియన్ నాయకులు భాను రాములు, నరసింహ, సురేష్, వైట్ క్లిప్ యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎన్.యాదగిరి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు

మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాసరి బాబు, తదితరులు

దూరవిద్య ఎంసీఏ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీఎఫ్ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 27లోగా సంబంధిత కళాశాల ల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

మహిళ అనుమానాస్పద మృతి

సైదాబాద్, మే 14: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ శంభోశ్వర్ బజార్ సాయిరాంనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా పరకాల గ్రామానికి చెందిన వెంకటేష్, అనూష దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్యా భర్తలు ఇద్దరు ఉదయం గొడవపడ్డారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో అనూష ఉరి వేసుకొని మృతి చెందటంతో మృతదేహాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వకుండా స్వగ్రామానికి తరలిస్తుండగా స్థానికులు సైదాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని వెనుకకు తెప్పించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. సైదాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దేశ రక్షణ నిధికి లక్ష రూపాయల విరాళం

లక్ష రూపాయల విరాళం చెక్కును ఎస్బీహెచ్ పంచ కాలనీల సమన్వయకర్తలకు అందజేస్తున్న సత్య ప్రకాష్ భరద్వాజ్, తదితరులు

సైదాబాద్, మే 14: దేశ సరిహద్దులో ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడుతున్న భారత జవాన్లకు సహాయంగా దేశ రక్షణ నిధికి లక్ష రూపాయల విరాళాన్ని సైదాబాద్ బ్యాంక్ కాలనీకి చెందిన తనిష్క్ ఫ్రాంచేజెస్ ప్రతినిధి బుర్ర సత్య ప్రకాష్ భరద్వాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన మనవడు, శ్రీక ఖ్యాణ్, మౌనిక దంపతుల కుమారుడు శ్రీహరి వెంకట సుబ్రహ్మణ్య మాయాస్కర రామ్ మొదటి పుట్టినరోజును పురస్కరించుకొని దేశ రక్షణ నిధికి లక్ష రూపాయల చెక్కును సైదాబాద్ ఎస్బీహెచ్ బ్యాంక్ పంచ కాలనీల సమన్వయ కర్తలు రావికంటి శ్రీనివాస్, ప్రభుకు అందజేశానని తెలిపారు. దేశ సరిహద్దుల్లో పనిచేస్తున్న సైనికుల త్యాగాల ఫలితంగానే మనమందరం ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నామని, వారి సేవలను, త్యాగాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పిస్తున్న సైనికులకు అండగా నిలవడం కోసం ప్రతి పౌరుడి బాధ్యతని, దేశ రక్షణ నిధికి తమ వంతుగా సహాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.దేశ రక్షణ నిధికి లక్ష రూపాయలను అందజేసి ఆదర్శంగా నిలిచిన సత్య ప్రకాష్ భరద్వాజను పలువురు ఎస్బీహెచ్ పంచ కాలనీవాసులు అభినందించి, తమ వంతు సహాయం చేస్తామని ప్రకటించారు.

చద్దన్నానికి భలే క్రేజ్..

బడంగ్‌పేట్, మే 14: చద్దన్నం తినడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. బడంగ్‌పేట్ ప్లేగ్రౌండ్ పక్కన ఏర్పాటుచేసిన చద్దన్నానికి భలే గిరాకీ పెరిగింది. ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాళ్లు తప్పనిసరిగా చద్దన్నం రుచి చూస్తున్నారు. ఉదయం టిఫిన్‌కు బదులుగా చద్దన్నం తినడానికి ఇష్టపడుతున్నారు. చద్దన్నానికి టిఫిన్‌కు అయ్యే ఖర్చు అవుతుంది. చద్దన్నం ధర రూ.40 రూపాయలు నిర్ణయించడంతో చాలామంది చద్దన్నం తినడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆయిల్ ఫుడ్‌కు స్వస్తి చెప్పి ఆయిల్ లేని ఫుడ్ తినడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సత్యం మాట్లాడుతూ, ఉదయం 6. 30గంటలకు చద్దన్నం తయారుచేసి స్టాల్‌కు తీసుకొస్తాను. సాయంత్రం 6:00 నుంచి 11 గంటల వరకు చద్దన్నంతోపాటు మిల్లెట్స్‌ను తయారు చేస్తామన్నారు. ఆర్గానిక్ లడ్డూలను తయారుచేస్తామని, చద్దన్నంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయన్నారు. నగరంలో నాగోల్, బడంగ్‌పేట్‌లో చద్దన్నం స్టాల్స్ ఏర్పాటు చేశామని, ప్రజల నుంచి మంచి ఆదరణ ఉందన్నారు.